# భామ అదృష్టం

లతిక



సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం; నేనూ, మావారూ, భామా దాని మొగుడూ! భామ నాకు చెల్లెలవుతుంది. అతను (భామ మొగుడు) మావారి ఆప్తమిత్రులు. అతన్ని తంబీ అని పిలుస్తారాయన. భామని పెళ్లి చేసుకున్నాక నాకు మరీ సన్నిహితు డయేడు. అదివరకు 'మీరు' అని మన్నించే దాన్నతన్ని. ఇప్పుడు మరిదీ అని పిలవడం అలవాటయింది.

వాళ్ల పెళ్లి వార్షికోత్సవమని, ఆవేళ సినిమా ప్రోగ్రాం ప్రపోజ్ చేసేడు మరిది. వాళ్లొస్తారని యెదురు చూస్తున్నాం. తీరా వాళ్లు రావడాని కింత ఆలస్య మెందు కైందో!

అదును దొరికితే చాలు, ఆడవాళ్ల సుదీర్ఘ—అలంకరణని పరిశోధనచేసే మా ఆయన ప్రారంభించేరు:

"మరదలుపిల్లా, నువ్వూ ముస్తాబు పూర్తి చేసుకునేసరికి సెకండ్ షోకి వేళవుతుంది." తల దువ్వుకుంటూనే వ్యాఖ్యానించే రాయన.

"మమ్మల్లనడ మెందుకూ! మీరు వెలగబెడుతున్న రాచకార్య మేవిటి యిందాక ట్నుంచి? ఆ దువ్వకోడాని కంతూ వంతూ వుందా? మీకున్న రెండాకు లెక్కువే చదివేడా మరిది. రానివ్వండడుగుతాను. ఏమయ్యా! పెద్దమనిషి! సినిమాకి తీసు కెళ్తానని చెప్పిన సికోసం యింతసేపు వడి గాపులు పడాలా అంటూ!"

నా మాటలు పూర్తికాకుండానే కాల్బెల్ మోగింది. రిక్షా ఆగిన చప్పుడు వినిపిం చింది. భామా మరిదీ వచ్చేరనుకుని వీధి వేపు చూదును గదా, ఖాళీ రిక్షా కనిపిం చింది.

"ఏరా! చినబాబూ వాళ్ళూ యేరి?" ఆయన ప్రశ్న.

"చినబాబు ఫ్రెండ్సు యీా ఇంటిలో వొస్తున్నారట. అళ్లతో మాటాడాలని ఓసిమి కెళ్లేరు బాబూ. మిమ్మల్ని సినిమా కెళ్లమన్నారు." రిక్షావాడి సమాధానం.

ఆయన నావేపు చూసేరు, 'వెళ్దామా?' అన్నట్టు.

"ఏం బాబూ! వస్తారా?" రిక్షావాడు

తొందరపడుతున్నాడు.

"ఊహుఁ సినిమాకి రాం. పార్కుకి వెళ్తాం. పడిచే వెళ్తాం. మువ్వెళ్లు."

బెల్లు మోగించుకుంటూ రిక్షా వెళ్లింది.

"అదేం లతా! పోనీ మనం వెళ్లడానికేం?"

"నాకేం చూడాలని లేదు. మీ తమ్ముడుం గారూ, మా భామా వస్తారని బయల్దేరా వంతే. పిలాస్మ లేని ఆతిథ్యంలా మనమే వెళ్లడం నాకు నచ్చదు. వెళితే అందరం కలిసే వెళ్లాలి."

"అయితే పార్కు కెళ్దామా?"

"ఏం యీసారి మీరు అప్‌సెట్ చేస్తారా? క్షణక్షణముల్ మగవాండ్ర చిత్తముల్."

"ఆడది విజృంభిస్తే మగాడు మాట్లాడ్డానికి సాహసించలేడు."

"అవును పాపం! అందునా మీరు మరీని! వస్తారా? ఉండిపోదామా?"

"లేదు లేదు. పద."

తీవ్రమైన ఆలోచన మనిషిని మాటాడనివ్వదు. అనుకున్నది కాకపోతే నాకు గొప్ప చికాకు. మాటాడకుండా నడుస్తున్నాను నేను. ఆయన మాత్రం యేదో చెబుతునే ఉన్నారు. వింటూ, ఆలోచిస్తూ, నడుస్తున్నాను నేను.

"ఏం లతా! ఇదంతా మరిది మీద కోపమేనా?"

"కాదు. మీ మీదే!"

"అదేమిటి? గాలి నా మీదికి తిరిగిందీ సారి? మధ్యన నేనేం చేసేను?"

"ఏం చేశానని అడుగుతారేం? మీరు చేసినదే యిదంతా!"

"ఇది మరీ బాగుంది. సినిమాకి రావద్దు ఉండిపో అని నేను చెప్పానా?"

"చెప్పినట్టే."

"అంటే?"

"అంటే, యింటి దగ్గర పెళ్లామూ, యిక్కడ మనమూ, తనతో సినిమాకి వెళ్లడానికి యెదురు చూస్తుంటే యిందర్ని కాదని—యెవరో కొత్తల్లో వస్తున్నారని స్టేషనుకి వెళడం బాగుందా?"

"బాగుంది లతా! ఎంతో అవసరం లేనిదీ—అతను మాత్రం ప్రోగ్రాం ఎందుకు మానుకుంటాడు?"

"అదే మీరు చేస్తున్న తప్పు. అతనికి తెలీకపోతే మీరు చెప్పాలి. వస్తానని చెప్పి, మానిడం అతని కిదేం కొత్త కాదు. అయినా మీ రతన్ని నమ్మడమే చిత్రం. మీ రిలా అతన్ని సమర్థించబట్టే...."

"నువ్వు పొరపాటు పడుతున్నావ్ లతా! ట్రెయిన్లో వెళ్తున్నది యెవరో యేమో?"

"ఏమైనా—భార్య కంటె కూడా చాలా యెక్కువ వాళ్ళు. అది మాత్రం నిజం."

"మరదలు కూడా నీ అంత ఘాటుగా ఆలోచిస్తే తంబి చాలా యిబ్బంది పడతాడు."

"అదో పిచ్చి మాలోకం. అదలా పట్టించుకోక పోబట్టే మీ ఆటలు సాగుతున్నాయి."

పార్కు చేరేం. నా కళ్లని నేనే నమ్మలేక పోయాను.

"మా అందరిలోకీ పవిత్రమైనవాడు తంబి ఒకడే' అని ఆయన తరచు కీర్తించే వ్యక్తి—పార్కులో నిర్జనంగా ఉన్న ఒక కార్నర్‌లో మరొక అమ్మాయితో నవ్వుతూ కబుర్లు చెబుతున్నాడు. ఆ అమ్మాయి భామ కాదు.

ఆయన వాళ్లని చూడలేదు. మాకు కొంత దూరంలో ఎవరో కనబడితే అతనితో మాట్లాడుతున్నారు. స్పీకర్లోంచి పాట వినిపిస్తోంది.

"నా ప్రేయసి సన్నిధియే స్వర్గమూ నా జీవిత గమ్యానికి మార్గమూ." అంటూ, ఈ పాట మరిదికి చాలాయిష్టం. వందలసార్లు విన్నా ఈ పాట తనకి విసుగనిపించదంటూ ఉంటాడు. ఆ పాట వినిపిస్తే చాలు. "అదిగో నా పాట" అంటూ గోల చేస్తాడు.

నా ఆలోచనలు పాట నుంచి మళ్లేయి. అతని ప్రవర్తన గురించి ఆలోచించసాగేను. ఎంత తెలివైన వ్యూహం, స్టేషనుకి వెళ్తున్నానని భార్యకి చెప్పి—మమ్మల్ని సినిమాకి వెళ్లమని రిక్షావాడి చేత కబురు పెట్టడంలోని అంతర్యమిదా? మేము సినిమాకి వెళ్తామనుకుని తానిక్కడ మరో ఆడదానితో ....

ఛీఛీ—తప్పుదారిన పడిన మగాళ్ళు తమ తప్పు, అయిన వాళ్లకి తెలీకుండా ఉండడాని కెన్ని నాటకా లాడతారు?

పెళ్లయి ఏడాదే అయింది. పెద్దలు చేసిన బలవంతపు పెళ్లి కాదు. తనకు తానై మనసుపడి చేసుకున్నాడు. పెళ్లి కాకముందు భామ కోసం యెంతని తపించేడు? ఇంతలో ఇంత మార్పా? ఆశించినది—లభించగానే—ఆ మోజు తీరిపోతుందా?

ఏణ్ణర్థం కిందట బంధువులింట్లో పెళ్లికని బయల్దేరుతూ, ఇతణ్ణి కూడా మాతో తీసుకెళ్లాం. నవ్వుతూ, సరదాగా కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, హుషారుగా ఉంటాడని. పెళ్లిలో భామని చూసేడు.

పెళ్లివారికి పన్నీరు జల్లుతూ, గంధం రాస్తూ, హారతి పాటలు పాడుతూ భామ కనిపిస్తే, అతని కళ్లలో ఎంత ఆరాధన?

తనని దేవతగా, తన సాన్నిధ్యం పెన్నిధిగా భావించే వ్యక్తి భర్తగా లభించడం కంటె స్త్రీకి అదృష్ట మేముంది? భామ అదృష్టాన్ని అభినందించేను. భామ యితనితో సర్వ సౌఖ్యాలూ అనుభవిస్తుం దని ఆశించేను.

అతని కోరిక—మా ప్రోద్బలం—భామ యిష్టపడడం — పెద్దల అంగీకారం అన్నీ వాళ్లిద్దర్నీ వధూవరులని చేసేయి.

స్త్రీ—తనది కాకముందు—అయినంత వరకూ పురుషుడు ప్రదర్శించే తపన — ఆ స్త్రీ, భార్య కాగానే క్షీణిస్తుందా? ప్రేయసిగా ఆరాధన అందుకున్న స్త్రీ—భార్యగా ఆ ఆరాధన అందుకోలేదా?

ఒకనాడు భామ కోసం పడిన తపన—యీనాడు మరో అమ్మాయి కోసమా! ఛీ—ఇలాటి వ్యక్తిని మరిదీ అని యెలా పిలవగలిగాను?

ఇక అక్కడ ఉండి, భామకి జరుగుతున్న అన్యాయం చూడలేకపోయాను. ఇంటికి బయల్దేరాం. నేను చూసిన ఘోరం ఆయనకి చూపించలేదు. ఆయనతో ఆ విషయం చర్చించదలుచుకోలేదు. తన తమ్ముడికన్న మిన్నగా, ఆత్మీయుడిగా చూసుకునే స్నేహితుడు తప్పు చేస్తాడని ఆయన అంగీకరించరు. అతని ప్రవర్త-

గురించి ఆయన కెంత నమ్మకం. ఆ నమ్మకపు ముసుగు అడ్డు పెట్టుకుని— తప్పుల చేస్తూ కూడా మంచివాడిలా చెలామణి అవుతున్నా డతను.

తప్పు చేసేవాళ్ళు—తమని పరిశీలనగా గమనించేవాళ్ల దగ్గిర జాగ్రత్తగా వడుచుకుంటారు. నే నతన్ని అనుమానించినట్టు అతనికి తెలియకూడదు. నేర్పుగా మాటల్లో మభ్యపెట్టి నేరస్తునిచే నిజం చెప్పించాలి. మళ్లీ మళ్లీ ఆ తప్పు చెయ్యకుండా చూడాలి.

భామకోసం నేనీ నిర్ణయం తీసుకున్నాను.

* * *

ఆఫీసుకి వెళ్తూ మరిది మా యింటికి రావడం—కాసేపు అవీ యివీ మాట్లాడుకుని యిద్దరూ కలిసి ఆఫీసుకి వెళ్లడం, వాళ్ల అలవాటు.

యథాప్రకారం మర్నాడు అతను వచ్చేడు. నవ్వుతూ పలకరించేడు. ఆ నవ్వులో కల్మషం లేదు. ఎదుటివాళ్లని మభ్యపెట్టే వంచన లేదు. నిష్కల్మష హృదయంతో మన సారా నవ్వుతూ మాటాడే వ్యక్తిలా కనిపించేడు.

నిన్న కలవరపరచిన సంఘటన కల కాదు కదా అన్న అనుమానం కలిగిందా నవ్వు చూస్తే !

"మరిదీ! మమ్మల్ని మరిచిపోయే వనుకున్నాను."

"మరిచిపోతే—యీవా లిక్కడి కెలా రాగలను ?"

"అయితే నిన్న మరిచిపోయావన్న మాట కట్టుకున్న భార్యని—కావాలనుకున్న అన్న వదినల్ని—వివాహ వార్షికోత్సవపు మధురానుభూతినీ—మరపింపజేసిన మహాత్ము లెవరో ! వారి అడుగుజాడల లోనే ప్రయాణం సాగించక పోయేవా ? మళ్లీ దారితప్పి యీ సామాన్యుల సహవాసం యింకెందుకు ?"

"అదేవిటి మరీ అంత నిష్ఠురంగా ఆడిపోస్తున్నావ్ ?" అని నన్ను వారిస్తూ

"మరేం అనుకోకు తంబీ ! లత ధోరణి నీకు తెలియని దేముంది ?" అంటూ సమా

# భామ అదృష్టం

ధాన పరుస్తున్నా రాయన

"అనుకోడాని కేముంది ? అలా నిలదీసి అడిగే అధికారం వహించగలవారు, వదినగారు తప్ప నా కెవరున్నారు ?"

"అడగడమూ, అనడమే మిగులు. నీ బుద్ధులు మాత్రం నువ్వు మానవు. ఇంతకీ నిన్న విజయం చేసిన...."

"ప్రసాదరావుగారని, హైస్కూల్లో చదివేటప్పుడు మా క్లాస్‌మేట్. ప్రస్తుతము కలకత్తాలో ఉంటునారు. స్కూలు విడిచిపెట్టిన యిన్నాళ్ల కిదే మళ్లీ మేం కలుసుకోడం. నే నిక్క డుంటున్నట్టు యీమధ్యనే తెలిసిందట. తనూ, మిసెస్సూ ట్రెయిన్లో వెళ్తూ కలుసుకోమని టెలిగ్రా మిచ్చాడు."

ఆ మాటలు అబద్ధాలు కావు. అబద్ధాలాడేవాళ్లకి ఎదుటివాళ్లు తమ మాటలు నమ్ముతున్నారా లేదా అన్న సంకోచం ఉంటుంది. ఆ ధోరణి యితనిలో అణుమాత్రమైనా లేదు.

నే నతన్ని అనుమానించిన మాటా నిజమే అయినా, అబద్ధాన్ని నిజంగా చెప్పే ప్రావీణ్యత అతనికి ఉందని—నేను సైతం అంగీకరించను.

ఈ డొంక తిరుగుళ్లన్నీ మానేసి భామనే అడిగితే? కాని అది మరికొన్ని ప్రమాదాలకి దారితీస్తుంది. నిజా నిజాలు తెలీకుండా యీ సంగతులు దానితో ప్రస్తావిస్తే—నిష్కారణంగా దాని మనశ్శాంతి పాడుచేసిన దాన్నవుతాను. అందుకని ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

ఇక మిగిలిం దొక్కటే. రేడియోలోపాట. ఆ ప్రసక్తి మళ్లీ ఎప్పుడేనా తీసుకురావాలి. మరికొన్నాళ్లు నిరీక్షించడానికే నిశ్చయించుకున్నాను. వారం రోజులు గడిచేయి.

* * *

పండగలొస్తే—మరిదినీ, భామనీ మా యింటికి పిలవడమో—వాళ్లు మమ్మల్ని ఆహ్వానించడమో మామూలు.

ఉగాదికి మా యింటికే పిలిచేం. మధ్యాహ్నం భోజనాలయేయి. సాయంత్రం సినిమాకి వెళ్దామన్నాడు మరిది. భామా, మా ఆయనా అంగీకరించేరు. నేనుమాత్రం పూరుకున్నాను. ముగ్గురూ ప్రశ్నలు ప్రారంభించేరు.

"వదినగారేదో ప్రణాళికలు వేస్తున్నట్లుంది"

"ఏవక్కా వెళ్దామా?"

"ఏం లతా! మౌనం అర్ధాంగీకారమని భావించవచ్చా?"

ముగ్గురి ప్రశ్నలకీ సమాధానం చెప్పేను.

"ఈవాళవెళ్దాం. కాని యిప్పుడు కాదు"

మరిది మళ్లీ తన మామూలు ధోరణిలో నవ్వుతూ అడిగేడు. "అదేవిటండోయ్! ముహూర్తం గట్రా పెట్టిస్తారా?"

"అదే ఆలోచిస్తున్నాను. మళ్లీ—ట్రెయిన్లోవెళ్లే స్నేహితులెవరూ అడ్డు తగలకుండా తిరుగులేని ముహూర్తం పెట్టిద్దామని! ఏవే భామా!"

"అడ్డు తగలడమే మంచిదక్కా!" భామ సమాధానం.

"అదేవిటే! నన్నుకాదని మీ ఆయన్ని సపోర్టు చేస్తున్నావ్! మరిది మాటలువింటే నీకేం లాభం? ప్రోగ్రాములు వాయిదా పడడం తప్ప"

"పడితేనేవక్కా! మంచి ప్రెజెంటేషన్లు దొరికాయి"

"ఎవరికి—మరిదికా?"

"ఇద్దరికిని. ఈ గాజులూ, ఆయన కట్టుకున్న నెక్‌టై—ట్రెయిన్లో కలిసిన దంపతుల బహుమానాలే!"

భామ చేతిగాజులూ, మరిది కట్టుకున్న టై, అతను స్టేషనుకి వెళ్లేడని ఋజువు చేస్తునేవున్నాయి. మరి పార్కులో నేను చూసింది? పార్కులో కొంచెంసేపు గడిపి, ట్రెయినుకి వెళ్లివుంటాడా? అదే అయితే పాట ప్రసక్తి తెచ్చి నిజం రాబట్టవచ్చు.

మౌనంగా నా ఆలోచనలు సాగుతున్నాయి. కాని నన్ను వాళ్లు ముగ్గురూ పూరుకోనిస్తేగా?

"లతాదేవీ! నీకు అలాంటివి కొనిపెట్టనా" శ్రీవారు ఆఫర్ చేస్తున్నారు.

"ఏవక్కా! ఈగాజులు నీకు నచ్చలేదా?" భామ సందేహం.

# భామ అదృష్టం

"ఏవండీ వదినా! ఈ పాట మీకు నచ్చలేదా?" భామని అనుకరిస్తూ మరిది వెక్కిరింపు.

రేడియో ట్యూన చేశా రాయన సన్నగా ఏదో సినిమాపాట వినిపిస్తోంది.

"శ్రోతలు కోరిన పాటలు వస్తున్నాయి. ఆడవాళ్ళూరుకుంటే వినిపిస్తాయి" మరిది వ్యంగ్యం.

"గోల చేస్తున్నది—మగవారే" భామ జవాబు.

"ఏం మరిదీ! నీ ప్రియతమగీతం—మార్గమూ స్వర్గమూ పాట ప్రసారం చెయ్యమని కోరేవా?"

"అవునండీ! విని చాలా కాలమయింది."

"అదేవిటి? కిందటివారమేగా ప్రసారం చేశారా పాట!"

"ఎప్పుడు?"

"ఎప్పుడేవిటీ! నువ్వు మన సినిమా ప్రోగ్రాంమిస్‌చేసిననాడే సినిమాకి వెళ్ళకుండా పార్కుకివెళ్తే అక్కడ వినిపించిందిపాట!"

"అరెరే! మన ప్రోగ్రాంతోపాటు–నా పాట కూడా మిస్సయా నన్నమాట.",

మాట చమత్కారంగావున్నా, తనా పాట వినలేకపోయానన్న నిరాశ అతనిలో స్పష్టంగా కనిపిస్తోంది.


పార్కులో నేను చూసినది లతనే అయితే నా మాటలకి నిర్ఘాంతపోయి ఉండేవాడు. ఏదో పొరపాటు జరిగింది. అన్యాయంగా యితని ప్రవర్తన అనుమానించి పాపం చుట్టుకున్నానని ఘోషించింది అంతరాత్మ.

భోజనాలుచేసి, సెకండ్ షోకి వెళ్ళాం. పండగ కావడంచేత థియేటర్లో చాలా రద్దీగా వుంది. నలుగురం ఒకచోట కలిసి కూచుందికి చోటు దొరకలేదు. వాళ్ళో దగ్గరా, మేమో దగ్గర కూచోవలసి వచ్చింది.

ఆట ప్రారంభమైంది. ఇంటర్వెల్లో హాలంతా కలియజూసేను. మావెనక వరసలో కూచున్న మరిది, మాముందు కనిపించేడు. అతనిపక్కన భామలేదు పార్కులో చూసిన అమ్మాయి కనిపించింది ఆశ్చర్యంతో వెనక్కు తిరిగిచూసేను. భామతో నవ్వుతూ కబుర్లు చెబుతున్నాడు మరిది.

"మా అందరిలోకీ పవిత్రమైనవాడు తంబి ఒకడే" అన్న శ్రీవారి మాటలు అంతరాంతరాలలో ప్రతిధ్వనించేయి.

అన్య స్త్రీలపట్ల ఆకర్షణ, పురుషుడు నిగ్రహించుకోలేని బలహీనత ఆ బలహీనత విషయంలో పురుషులంతా ఒకటేనన్న—నమ్మకపు రంగుటద్దాలలోంచి పురుష ప్రపంచమంతా ఒకేలా కనిపించిందిన్నాళ్ళూ. కాని అందరూ అలాటివాళ్ళుకారు మరిది లాటి మంచివాళ్ళూవున్నారు. భామ అదృష్టవంతురాలు! ●


## ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీసు: 151, మౌంట్ రోడ్, మద్రాసు-2

యం.సిటి. ముత్తయ్య — చైర్మన్

కె.యం. నంజప్ప — జనరల్ మేనేజర్